## ఖమ్మం సీపీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సునీల్ దత్

మామిళ్లగూడెం, జనవరి 5 : ఖమ్మం నూతన పోలీస్ కమిషనర్‌గా సునీల్ దత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్ కమిషనర్ కార్యాలయానికి చేరుకున్న సునీల్ దత్.. సీపీ విష్ణు ఎస్ వారియర్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సునీల్ దత్ ప్రస్తుతం హైదరాబాద్ సిటీ ఈస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ)గా విధులు నిర్వర్తిస్తూ ఖమ్మం సీపీగా బదిలీ అయ్యారు. గతంలో భద్రాచలం ఏఎస్పీగా, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా పని చేశారు. 2022 జూలైలో హైదరాబాద్ డీసీపీగా బదిలీపై వెళ్లారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## నాయకులు బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

### మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 5: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీటీసీ అయిలూరి కృష్ణారెడ్డి నివాసంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చూసి పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని, గెలుపోటములు సర్వ సాధారణమన్నారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించాలన్నారు. పార్టీకి పూర్వవైభవం వచ్చేలా పని చేయాలన్నారు. హైదరాబాద్‌లో ఈనెల 9న జరుగనున్న పార్టీ ఖమ్మం పార్లమెంటరీ సమీక్ష సమావేశానికి ముఖ్యనాయకులంతా తరలిరావాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ భారత లాలమ్మ, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, సర్పంచ్ చిరంజీవి, నాయకులు లక్ష్మణరావు, నర్సారెడ్డి, నరసింహ, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, చల్లా రాంబాబు, రంగా, పుల్లారావు, వెంకన్న పాల్గొన్నారు.

# ఈ-కేవైసీపై అంతటా అయోమయం

- ప్రక్రియ పూర్తికాకపోతే 'రూ.500 సిలిండర్' రాదేమోనని వినియోగదారుల ఆందోళన
- గ్యాస్ ఏజెన్సీల వద్ద గంటల కొద్దీ పడిగాపులు
- ఈ-కేవైసీకి, ప్రభుత్వ రాయితీలకు సంబంధం లేదని అధికారుల స్పష్టీకరణ
- ప్రక్రియ పూర్తి చేసేందుకు ఎలాంటి గడువు లేదని ప్రకటన



ఖమ్మం, జనవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గ్యాస్ సిలిండర్ వినియోగదారులు తాము సిలిండర్ పొందుతున్న సంస్థల్లో తప్పనిసరిగా ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) నమోదు చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఏళ్ల నుంచి గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు సిలిండర్లు సరఫరా చేస్తున్నప్పటికీ వినియోగదారుల తాజా వివరాలు రికార్డు చేయడం కోసమే ఈ ఈ-కేవైసీ. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీలు తమ గ్యాస్ ఏజెన్సీల ద్వారా దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపడుతున్నాయి. ప్రక్రియ పూర్తి చేసేందుకు కొన్ని రోజుల నుంచి వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల ఎదుట గంటల కొద్దీ బారులు తీరుతున్నారు. ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేదే అని అధికారులు చెబుతున్నా, అదే తంతు ఇప్పటికీ కొనసాగుతున్నది. ప్రక్రియపై వినియోగదారులకు స్పష్టత, అవగాహన లేకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందనేది వాస్తవం.

### జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా..

ఖమ్మం జిల్లాలో సింగిల్ సిలిండర్ కనెక్షన్లు 2,01,640, డబుల్ సిలిండర్ కనెక్షన్లు 78,023, దీపం పథకం కనెక్షన్లు 59,742, సీఎస్సార్ కనెక్షన్లు 23,688, ఉజ్వల కనెక్షన్లు 47,311 ఉండగా గ్యాస్ ఏజెన్సీలు 34 ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో వినియోగదారులు ఈ- కేవైసీ పూర్తయితేనే ఆ సిలిండర్ వస్తుందని భావిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మంది వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తిండీ తిప్పలు మానేసి రేషన్, ఆధార్‌కార్డు, వంటగ్యాస్ కార్డు జిరాక్సులతో ఈ కేవైసీ చేయిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వ రాయితీలకు, ఈ కేవైసీకి ఎలాంటి సంబంధం లేదని, ఈ కైవైసీ చేసుకోకపోయినా రాయితీ వర్తిస్తుందని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నా ఏజెన్సీల వద్ద రద్దీ తగ్గడం లేదు. అధికారులు ప్రజలకు సరైన అవగాహన కల్పించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రసార మాధ్యమాల ద్వారా ఈ కేవైసీపై అవగాహన కల్పిస్తే బాగుంటుందంటున్నారు. వినియోగదారుల ఇబ్బందులు తొలగించడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఒక ముందడుగు వేసింది. ఓ మొబైల్ యాప్ రూపొందించింది. యాప్ ద్వారా వినియోగదారులు ఇంటి నుంచే ఈ-కేవైసీ పూర్తి చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈ కేవైసీపై 'నమస్తే' జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీలతను వివరణ కోరగా.. 'ఈ కేవైసీ ఎలాంటి గడువు విధించలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలకు ఈ కేవైసీకి ఎలాంటి సంబంధం లేదు. వినియోగదారులు ఎవరూ ఆందోళన చెందొద్దు. ఎప్పుడైనా ఈ కేవైసీ చేసుకోవచ్చు..' అని సమాధానమిచ్చారు.

## అంకితభావంతో పని చేసి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఛేదిద్దాం

### వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి సీఎండీ బలరాం పిలుపు



మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ ఈ ఏడాది 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నదని, ఆ లక్ష్యాన్ని ఛేదించేందుకు సింగరేణీయులంతా అంకితభావంతో పనిచేద్దామని, ప్రతి ఒక్క రోజును విలువైనదిగా భావించి ముందుకెళ్లాలని సీఎండీ బలరాం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలు, ఉన్నతాధికారులతో శుక్రవారం రోజువారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, అడ్రియాలా లాంగ్‌వాల్ ప్రాజెక్టు, కంటిన్యూయస్ మైనర్లు, సీహెచ్‌పీలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. రానున్న వేసవిలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉండే విధంగా రోజుకు 2.24 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుందన్నారు. రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది మొదటి తొమ్మిది నెలల కాలంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓవర్‌బర్డెన్ తొలగింపు, ఆశాజనకంగా ఉన్నాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే బొగ్గు ఉత్పత్తిలో ఈ ఏడాది ఇప్పటివరకు 5.15 శాతం వృద్ధి, రవాణాలో 8 శాతం వృద్ధి, ఓవర్ బర్డెన్ తొలగింపులో 6 శాతం వృద్ధి సాధించామన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న మూడు నెలల్లో సమష్టిగా పనిచేసి లక్ష్యాలను సాధించాలని సూచించారు. సమీక్షలో సంస్థ డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వరరెడ్డి, ఈడీ (సీఎం) ఆల్విన్, జీఎం కో-ఆర్డినేషన్ సురేష్, జీఎం సీపీపీ జక్కం రమేశ్, జీఎం ఎంపీ మల్లెల సుబ్బారావు, జీఎం మార్కెటింగ్ దేవేందర్, జీఎం సివిల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రజల వద్దకు పాలన లక్ష్యంతోనే 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


దరఖాస్తుదారు సందేహాన్ని నివృత్తి చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 5: ప్రజల వద్దకు పాలన తీసుకుపోవాలనే సత్సంకల్పంతోనే రాష్ట్రప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని 54వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. శనివారంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తులు ఇవ్వని వారు చివరి రోజు కూడా గ్రామాల్లోనైతే పంచాయతీ కార్యాలయాలు, పట్టణాల్లో అయితే వార్డు కార్యాలయాల్లో అధికారులకు అందజేయవచ్చన్నారు. తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించిందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులకే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. మిగతా పథకాల లబ్ధి కోసం ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఇంటికే పథకాలు నడచివస్తాయని భరోసానిచ్చారు. అనంతరం పలువురు దరఖాస్తుదారులతో మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంజుల, కమర్తపు మురళి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కిన్నెరసానిలో ఆటల సందడి

### రెండో రోజూ కొనసాగిన రాష్ట్రస్థాయి క్రీడలు

పాల్వంచ, జనవరి 5 : మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ మోడల్ స్కూల్‌లో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలు శుక్రవారం రెండో రోజుకు చేరాయి. గిరిజన ఉప సంచాలకులు మణెమ్మ రెండో రోజు క్రీడలను ప్రారంభించారు. ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారమ్స్, కబడ్డీ, ఆర్చరీ, టెన్నికాయిట్, హైజంప్ తదితర అంశాల్లో ఉట్నూరు, ఏటూరునాగారం, ప్లేన్ ఏరియా, భద్రాచలం డివిజన్ల వారీగా క్రీడాకారులు సత్తా చాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సీహెచ్.బుచ్చిరాములు, నామానాయక్, చందు, భద్రు, నాగమణి, శారద, చంద్రకళ, జగన్, ఏఎస్‌వోలు బి.రాంబాబు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, బి.నెహ్రూ, పీడీలు, పీఈటీలు అన్నం వెంకటేశ్వర్లు, డాక్టర్ వీరనాయక్, బుగ్గ వెంకటేశ్వర్లు, బట్ట హరికృష్ణ, సైదులు, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

## నీటి ఎద్దడి రాకుండా చూడాలి..

### వేసవిలో తాగునీటిపై ప్రణాళికతో ముందుకెళ్లాలి


### అధికారులతో సమీక్షలో కలెక్టర్ వీపీ గౌతమ్


మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం, జనవరి 5 : వచ్చే వేసవిలో జిల్లావ్యాప్తంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు చేపట్టే ముందు జాగ్రత్త చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ , ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 589 గ్రామాల పరిధిలోని నివాస ప్రాంతాల్లో జనాభాకు సరిపోయేంత నీటి లభ్యతపై సమీక్షించారు. జిల్లాలోని తాగునీటి వనరులు, వాటిలో నీటి లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అమృత్ పథకం కింద 18 ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణం చేపట్టామని, వీటిలో 16 నిర్మాణాలు పూర్తి చేసి వాడకంలోకి తెచ్చామన్నారు. మిగతా రెండు వారంలోపు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. మొత్తం 685 కిలోమీటర్ల మేర పైపులైన్ పూర్తి చేసినట్లు తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో ఒక ఈఎల్ఎస్ఆర్, 27.42 కిలోమీటర్ల పైపులైన్ పనులు మంజూరు చేసుకొని.. 93 శాతం మేర పూర్తికాగా.. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మధిరలో 104.01 కిలోమీటర్ల పైపులైన్, 5 నిర్మాణాలు మంజూరు చేసుకొని, 91 శాతం పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, డే, రెసిడెన్షియల్ విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు తదితర అన్ని ప్రభుత్వ సంస్థల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చి నీటి సరఫరా చేయాలన్నారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, మిషన్ భగీరథ ఎస్ఈ సదా శివకుమార్, ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణకు చర్యలు

### డీఎఫ్‌వో కిష్టగౌడ్


కనకగిరి గుట్టల్లో అడవిని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

జూలూరుపాడు, జనవరి 5 : అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎఫ్‌వో జీ.కిష్టగౌడ్ పేర్కొన్నారు. జూలూరుపాడు రేంజ్ పరిధిలోని గుండెపుడి సెక్షన్, నల్లబండబోడు బీట్‌లోని కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్‌ను శుక్రవారం ఎఫ్‌డీవో కోటేశ్వరరావుతో కలిసి ఆయన సందర్శించారు. అటవీ ప్రాంతంలో కలియతిరుగుతూ చెట్లు, మొక్కలను పరిశీలించారు. అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లు, చెక్‌డ్యాంలను పరిశీలించారు. జంతువుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, వేటగాళ్లను అడవిలోకి ప్రవేశించకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో సదస్సులు నిర్వహించి.. అడవుల ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. అడవి జంతువుల వేట నేరమనే అంశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వీరి వెంట ఎఫ్‌ఆర్‌వో జీ.ప్రసాదరావు, అటవీ శాఖ సిబ్బంది కే.లక్ష్మీనర్సు, కిషన్, ధనలక్ష్మి, కిషన్, రవి, రహీం, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## ఆరు గ్యారెంటీలు వర్తింపజేయాలి

### భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు


చుంచుపల్లి మండలం విద్యానగర్‌లో గ్రామసభను సందర్శించిన జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, సీఈవో విద్యాలత

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలు వర్తింపజేయాలని భద్రాద్రి జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ, పెనగడప గ్రామాల్లో ఆయన ప్రజా పాలన గ్రామసభలను సందర్శించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు ఎవరైనా దరఖాస్తులు పూర్తి చేయడం మరిచిపోయినా వారికి చెప్పి మరీ పూర్తి చేయించాలన్నారు. శనివారంతో ముగియనున్న గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ అధికారులు ఆన్‌లైన్ చేస్తారన్నారు. జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట మండల కేంద్రాల్లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గ్రామసభలను సందర్శించారు. కలెక్టర్ ప్రియాంక ఆల గ్రామసభలను పర్యవేక్షించారు. అదనపు కలెక్టర్ రాంబాబు గ్రామసభల తీరును పరిశీలించారు. ఆయా మండలాల ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తుల స్వీకరణలో లోటుపాట్లను గమనించి ఆన్‌లైన్ విధానంపై వివరించారు. మున్సిపాల్టీల్లో చైర్మన్లు, ప్రత్యేకాధికారులు గ్రామ సభలను పగడ్బందీగా నిర్వహించారు.

# అధిక ధరలు.. మంచి దిగుబడులు

- జిల్లాలో ఏటికేడు పెరుగుతున్న మిర్చి పంట సాగు
- ఈ ఏడాదిలో ఇప్పటికే మొదలైన మిర్చి కల్లాలు
- మంచి ధర పలుకుతుండడంతో రైతుల సంబురం
- వేలాది మంది వలస కూలీలకు 4 నెలల ఉపాధి

జిల్లాలో మిర్చి కల్లాలు జోరందుకున్నాయి. గత నెల నుంచే తోటల్లో మిర్చి కోతలు మొదలుకాగా.. ఇప్పుడు ఆ పంటంతా కల్లాల్లోకి చేరుకుంటోంది. వాణిజ్య పంటల్లో ముఖ్యమైనదిగా ఉన్న ఈ మిర్చి పంటను జిల్లా రైతులు ఈ ఏడాది 70 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఖర్చులు అధికంగానే ఉన్నా ఆదాయం కూడా ఇదే రీతిలో ఉంటుండడంతో అధిక మంది రైతులు ఈ పంట సాగు కోసం ఆసక్తి చూపిస్తున్నారు. డిసెంబర్ నుంచి మొదలయ్యే మిర్చి తోటల పనులు ఏప్రిల్ వరకు ఉంటాయి. అయితే, గతంలో రికార్డు స్థాయిలో ఎకరాకు 30 క్వింటాళ్ల వరకూ మిర్చి దిగుబడి రాగా.. తెగుళ్ల వంటి కారణాలతో ఈసారి కాస్త తగ్గింది.


కిష్టాపురంలో కల్లంలో ఎండబెట్టిన మిర్చి పంట

కూసుమంచి, జనవరి 5 : వనరులు పుష్కలంగా ఉండడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, ధరలు కూడా అధికంగా పలుకుతుండడం వంటి కారణాలతో జిల్లా రైతులు ఏటికేడు మిర్చి సాగు విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. జూలూరుపాడు, కూసుమంచి, తిరుమలాయపాలెం, మధిర, బోనకల్లు, చింతకాని, ముదిగొండ మండలాల్లో ఈ పంట అత్యధికంగా సాగవుతోంది. తల్లాడ, నేలకొండపల్లి, కొణిజర్ల, ఏన్కూరు, ఎర్రుపాలెం, కామేపల్లి వంటి మండలాల్లో సాగర్ ఆయకట్టుకు నీరు రాకపోవడంతో ఆ ప్రాంతాల్లోని కొందరు రైతులు మాత్రమే మిర్చి తోటలవైపు వెళ్లారు.

### ఎకరానికి 15- 25 క్వింటాళ్ల దిగుబడి

మిర్చిలో ఎకరానికి సగటున 15 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. నిరుడైతే 20-30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే.. క్వింటాకు రూ.20 వేలకు పైనే ధర పలుకుతుండడం, ఎకరాకు రూ.3 లక్షలకు పైగానే ఆదాయం వస్తుండడం, పెట్టుబడులు పోను రూ.లక్ష వరకు మిగులుతుండడం వంటి కారణాలతో ఎక్కువ మంది రైతులు ఈ పంటను సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. వైరస్‌ల వంటివి సోకినా తగిన సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

### పలు రాష్ట్రాల నుంచి వలస కూలీలు

మిర్చి తోటలు ఏరడానికి పలు రాష్ట్రాల నుంచి వలస కూలీలు వస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చేరుకుంటున్నారు. ఇప్పటికే కొందరు చేరుకొని పనుల్లో నిమగ్నమయ్యారు. ఐదు నెలలపాటు ఇక్కడే ఉండి పనులు ముగించుకొని వెళ్తారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల కూలీలకు అక్కడ పనులు దొరకకపోవడంతో గత ఐదారేళ్లుగా ఇక్కడికి వలస వచ్చి మిర్చి తోటల్లో పనులు చేస్తున్నారు. మిర్చి ఏరినందుకుగాను కేజీకి రూ.10 చొప్పున ఇక్కడి రైతులు కూలి ఇస్తుండడంతో వారంతా రైతుల మిర్చి తోటల వద్దనే గుడారాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. అక్కడ పనులు పూర్తయితే మరో ప్రాంతానికి వెళ్తున్నారు. అయితే.. పాలేరు నియోజకవర్గంలో ముఖ్యంగా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో ఈసారి రైతులు మిర్చిని అధిక విస్తీర్ణంలోనే సాగు చేశారు. దిగుబడులు కూడా గణనీయంగానే వచ్చాయి. జిల్లాలో నిరుడు 95 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు కాగా.. తెగుళ్ల కారణంగా ఈ ఏడాది 70 వేల ఎకరాల్లోనే సాగవుతోంది. కానీ.. గడిచిన ఐదారేళ్లుగా పరిశీలిస్తే మిర్చిసాగు విస్తీర్ణం పెరుగుతూనే ఉంది.


మిర్చి కోస్తున్న మహారాష్ట్ర, ఒడిశా కూలీలు

### 11 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నా..

నేను ఈసారి 11 ఎకరాల్లో మిర్చి తోట వేశాను. ఇప్పటివరకు 175 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంకా 150 క్వింటాళ్ల వరకూ వస్తుంది. మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో 55 క్వింటాళ్లను విక్రయించాను. మిగిలిన పంటను కోల్డ్ స్టోరేజీలో పెట్టారు. నిరుడు 5 ఎకరాల్లో తోట వేశాను. కానీ.. దిగుబడి పెద్దగా రాలేదు. ఈసారి మాత్రం ఎకరానికి కనీసం 30 క్వింటాళ్ల వరకూ వచ్చింది. దీంతో పెట్టుబడి పోను ఎకరానికి సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుంది. –మునిగేపల్లి శేషగిరి, రైతు, ఎర్రగడ్డ, తిరుమలాయపాలెం